# చిక్కావు చేతిలో చిలకమ్మా!

– ఎ.వి. శేషారత్నం

తప్పిపోయిన లేడి పిల్లలా – అమాయకంగా బెదురు చూపులు చూస్తోందా అమ్మాయి.

పాతికేళ్ళుండవేమో – చేతిలో చిన్న ట్రంకు పెట్టె–

బిగించిన పెద్ద జడ కొసన గులాబీ రంగు ఊలు ముక్క – తల్లో మందారపువ్వు వాడి రాలిపోవడానికి సిద్ధంగా వుంది

పసుపు రాసిన పచ్చని ముఖం మీద కాసంత ఎఱ్ఱ బొట్టు – భయం భయంగా చూస్తున్న పెద్ద కళ్ళతో బొద్దుగా ముద్దుగా ముద్దబంతి పువ్వులాగుంది

రాక్షసిలా అరుస్తూ రైలు ప్లాటుఫారమ్ సమీపిస్తున్న కొద్దీ ఆ పిల్లలో గాభరా బి పి. లా పెరిగిపోతోంది

చాలా సేపట్నుంచీ ఆమెనే చూస్తున్న నరుసు నవ్వుకుంది సుతారంగా– పల్లెటూరు పిల్లయి వుంటుంది. ఒక్కతీ పెట్టె చంకన పెట్టుకుని బెదురు చూపులు చూస్తోందంటే ఇదేదో ఇంట్లోంచి ఉడాయిస్తున్న సరుకయి వుంటుంది. కాస్త హడలగొడితే రంగు బయటపడుతుంది నమ్మించి లేపుకొచ్చిన మగాడు డబ్బూ దస్కంతో ఉడాయించి ఉంటాడు!

వయ్యారంగా నడుస్తూ వచ్చి ఆగింది రైలు.

ముద్దబంతి పువ్వు రైలెక్కనా మాననా అన్నట్టు సందిగ్ధంలో అడుగు ముందుకు కదిపి మళ్ళీ ఆగిపోయింది.

నరుసు మెల్లిగా ఆ అమ్మాయిని సమీపించింది. చేతిలో లాఠీని అటూ యిటూ ఆడిస్తూ గద్దించింది–

'ఏయ్ పిల్లా ఎక్కడికెళ్తున్నావు?'

ఆ అమ్మాయి గాభరా పడిపోయి – బాంబు ప్రేలినట్టులికిపడి చేతిలో పెట్టె దబాలున కింద పడేసింది. పెట్టె డబ డబలాడింది పెద్దగా మూలిగి –

'మరి . . మరి .. మా మావ .... వస్తానన్నాడు ఇంకా రాలేదు .. చెన్న చెన్నపట్నం . పోతున్నాం'

తడారిపోతున్న గొంతుకతో నత్తి నత్తిగా అంది. ఆమె కళ్ళల్లో అబద్ధం ఆడుతున్న బెదురు స్పష్టంగా పట్టేసింది నరుసు.

అధికారం ప్రదర్శిస్తూ అంది – మీ మావెక్కడి కెళ్ళాడు?'

ముద్దబంతి కళ్ళలో కావేరి కట్టలు తెంచుకుంది బావురుమంది.

'ఇంతక్రితం రైల్లో మావకి ఎక్కువగా పొత్తి కడుపులో నెప్పి వచ్చేసింది. ఈ స్టేషన్లో దిగిపోయాం – మందు కొనుకొస్తానని మావ వెళ్ళి నాలుగయిదు గంటలయింది. మావకి ఏమయిందో?'

ఆలోచనలో పడింది నరుసు. ఆమె కనుబొమలు ముడివడ్డాయి.

'ఏంటో ఈ కాలం ఆడపిల్లలు – కాస్త ఎఱ్ఱగా బుఱ్ఱగా వుంటే బుట్టలో పడిపోవడమే అనుమానించినట్టే అయింది. ఆ మావ అన్న శాల్తీ దీన్ని లేవదీసుకుపోతూ మధ్యలో కడుపు నెప్పి వంకతో డబ్బు కొట్టేసి నట్టేట్లో ముంచి మాయమయ్యాడు. పిట్ట బోల్తాపడి బిత్తర చూపులు చూస్తోంది.'

'ఏయ్ అసలు చెన్నపట్నం ఎందుకు పోతున్నారు?'

ముద్దబంతి తల ఊగించింది. చెవులకున్న రవ్వల దుద్దులు లైటు కాంతికి తళుక్కుమన్నాయి.

'నాకు సినిమా పిచ్చి – మావకి చెన్నపట్నంలో తెలిసినవోళ్ళు బోల్డు మంది ఉన్నారు. నన్ను సినిమాలో చేరిపిస్తానన్నాడు. నా నగలమ్మి చెన్నపట్నం పోతున్నాం –'

మావ మీద అప్పటికే అనుమానం కలిగినట్టుంది ముద్దబంతికి. చెప్పనా వద్దా అనుకుంటూనే విషయం మెల్లిగా బయటపెట్టింది.

అంతే – నరుసు తన అధికార హోదాని బయట పెట్టింది.

"నేనెవరో తెలుసా చిలకా? డూటీ మీదున్న ఆడ పోలీసుని నువ్వు చెప్తున్నది నిజమో కాదో – నీ కేసేదో అనుమానాస్పదంగా ఉంది నడు పోలీస్ స్టేషన్కి"

పోలీస్ స్టేషను అనగానే ఘొల్లుమంది ముద్దబంతి రెండు చేతులూ జోడించింది. ఆమె చెక్కిళ్ళపై ముత్యాలు దొర్లిపోతున్నాయి అవిరళంగా–

'నేను చెప్పినదంతా నిజమేనమ్మా – మా మావ కోసం ఎదురు చూస్తున్నాను. ఈ రైలు ఎటు పోతుందో నాకు తెలీదు నేను ఇంట్లో చెప్పకుండా వచ్చింది తప్పే. ఈ తప్పు కాసి నన్ను మా వూరెళ్ళే రైలెక్కించండమ్మా'–

'అదేం కుదర్దు ఇంకెక్కడి మావ? నీ డబ్బుతో హుష్ కాకి అనేశాడు. నిన్ను ఇంకా కొన్ని ప్రశ్నలు వెయ్యాలి. పద స్టేషన్కి. ఈ మధ్య అన్నీ ఇలాంటి కేసులే. నీ తప్పు లేకపోతే మీ వూరు పంపేస్తాంలే–'

ఏడుపు మొహంతో బిక్కు బిక్కుమంటూ నరుసు ననుసరించింది ముద్దబంతి.

ఆటో స్పీడుగా మలుపులు మీద మలుపులు తిరుగుతూ నిర్మానుష్యమైన భవనం ముందు ఆగేసరికి గుండె ఝల్లుమంది. అనుమానంగా నరుసుకేసి చూసింది.



'పోలీస్ స్టేషన్ అన్నావు'.

'దిగవే టక్కులాడీ! లేచిపోయినదానికి ఏదైనా ఒక్కటే – సరైన చోటుకే తెచ్చాను. మళ్లీ ఏ మొహం పెట్టుకుని ఇంటికెళ్తావు? మీ బాబు రానిస్తాడా? నీ బతుకు తిండికి మొహం వాయకుండా గడిచేలా చేస్తాను పద పద'–

తనేదో వలయంలో చిక్కుకున్నట్టు – నరుసు 'ఆడ పోలీసు కాదని, తను మోసపోయిందని అర్థమయిన ముద్దబంతి ఏడుస్తూ గింజుకోవడం మొదలెట్టింది.

'కరీమ్' – నరుసు కేకకి ఇద్దరు దృఢకాయులు పాడుపడిన భవనంలోంచి బయటికొచ్చారు.

'దిగవే – నీలాంటి చిలకల్ని పట్టడమే నా పని. ఇవాళ బేరం బాగుంది. అందమైన చిలకవిగదా వెయ్యి రూపాయిలు కిట్టాయి నాకు.'– అంటున్న నరుసు నోట్లో మాటలు నోట్లోనే ఉన్నాయి.

ఆమె కళ్ళు భయంతో వెడల్పయాయి–

ముద్దబంతి జాకెట్లోంచి విజిల్ తీసి గట్టిగా ఊదింది ట్రంకుపెట్టెని కాలితో తన్నింది.

బిల బిలమంటూ పోలీసులు పరిగెత్తుకొస్తున్నారు

'ఏం చిలకా? నువ్వు ఆడ పోలీసువా? ఈ పేరుతో ఈ ఆర్నెల్లూ నువ్వు ఎన్ని వేలు చేసుకున్నావో నీ చేతే కక్కిస్తాను పద' – ఇద్దరు పోలీసులు ముద్దబంతికి సెల్యూట్ కొట్టి నరుసును స్వాధీనం చేసుకున్నారు

పక పకమని నవ్వుతూ పాడుబడిన భవనంకేసి దర్పంగా ఠీవిగా అడుగులు వేసింది ముద్దబంతి ఉరఫ్ కల్పన.

అప్పటికే ఆ భవనాన్ని చుట్టుముట్టారు పోలీసులు. 'యస్ మేడమ్' అంటూ ఆమె ననుసరిస్తున్న పోలీసులను విస్తుబోయి చూస్తూ అవాక్కయి నిలుచుండిపోయింది నరుసు. □